# విలువ

వనజ తెల్లారి అయిదు గంటలు కాకుండానే లేచింది. లేచింది మొదలు లేడిలా పనిలో దూకింది. మరి, ఆ రోజే అలాంటిది. అత్యంత ఆప్తమిత్రులు కనీసం పదిమంది భోజనానికి వస్తున్నారు. అందరూ అయినవాళ్లే. చిరకాల మిత్రులే. అదీకాక వనజ చేతి వంటంటే పడిచచ్చిపోయేవాళ్ళే.

అందరూ కలిసి ఆ రోజు భోజనానికి రావడానికి కారణం లేకపోలేదు. కామేశాన్ని ఖరగ్‌పూర్ బదిలీచేశారు సర్కారువారు. పదిహేనేళ్లుగా ఇదే వూర్లో వుండిపోయిన కామేశానికి ట్రాన్స్‌ఫరు రావడం అందరికీ బాధాకరమైనా, దాన్నంటి పెట్టుకుని వున్న ప్రమోషను పూరటనిస్తోంది.

ట్రాన్స్ఫరయిందని తెలియగానే కామేశానికి ఇంటా బయటా జరిగిన గారాం యింతా అంతా కాదు. దానికి తగ్గట్లుగా అక్కడ వంట చేసుకుని తింటా నని ప్రకటించడంతో కామేశం గ్లామరు మరీ పెరిగిపోయింది ఫ్రండ్స్ సర్కిల్లో. అంతటితో ఆగక వనజ బాధ్యతని మణుగుల కొద్ది పెంచి ఆమె నెత్తిమీద పెట్టారు.

కామేశం లాంటి మగవాడు ఒంటరిగా దూరపుటూళ్లో వండుకొని తింటూ ఉద్యోగం చేయడం అంటే మాటలా ? కాదు. కానేకాదు-కొన్ని కోట్లమంది స్త్రీలు ఉద్యోగాలుచేస్తూ, ఇంట్లో వంటలు చేస్తూ, పిల్లల్ని సాకుతూ, భర్తల్ని సేవించు కుంటున్నారు. కానీ అది వేరు- వారు ఆడవారు. మగవాడు - ఎప్పుడూ ఇటు గ్లాసు అటు పెట్టటం ఎరుగనివాడు. రుచులు చెప్తూ భోజనం చెయ్యడమేగనీ, వంట చేయడంలో వున్న సాధక బాధకాలు ఎప్పుడూ ఆలోచించని వాడు. వంట అనేది ఆడవాళ్ళే చెయ్యాలని పూర్తిగా నమ్మినవాడు.

అలాంటివాడు తనే నలుడినో, భీముడినో అవుతానని శపథం చేశాడంటే కారణం.

"రోజుల కొద్దీ హోటలు భోజనం చేస్తే రోగిష్టివాడవై పోతావు సుమా" అని మిత్రబృందం హెచ్చరించటమే.

అందుకే కామేశం ప్రయాణానికి వనజ తయారుచేసి సమకూర్చవలసిన సరంజామా జాబితా తయారైంది.

ఆవకాయ, మాగాయ, గోంగూర, మిరపప్పళ్ళ పచ్చడి, చింతకాయ, ఉసిరి కాయ, అల్లప్పచ్చడి -

కందిపొడి, పుట్నాల పప్పుపొడి, నువ్వుపప్పు పొడి, కొబ్బరిపొడి, కారప్పొడి -

వంటకి కూరపొడి, చారుపొడి, సాంబారు పొడి- ఇలా- ఇన్‌స్టాంట్ వంట సాధకాల జాబితా వనజ ముందు నిలిచింది

అయితే మూడు రోజులుగా క్షణం తీరిక లేకుండా నడ్డి విరిగిపోయేలా ఇవన్నీ తయారుచేయడంలో చిన్న కుటీర పరిశ్రమలాంటి కార్యక్రమంలో మునిగి పోయింది వనజ.

మోకాళ్ళ నొప్పులైనా, నడ్డి గిజగిజలాడిపోతున్నా పంటిబిగువున పనంతా పూర్తి చేస్తోంది.

ఈ రోజే రాత్రికి కామేశం ఖరగ్‌పూర్ ప్రయాణం, మధ్యాహ్నం విందు భోజనం.

"వనం! మన వాళ్ళందరికీ అపురూపమైన ఆవళ్ళంటే మహాయిష్టం- విజిటబుల్ బిర్యానీ తినీ తినీ విసుగ్గా వుందిట. హాయిగా పులిహోర చేయించవోయ్ అన్నారు. అందులో నీ చెయ్యి తిరిగింది. కాస్త ఆవ తగిలించు- ఇకపోతే గుత్తి వంకాయ, కొబ్బరి పచ్చడి, సాంబారు- ఇంకా వడియాలు, అప్పడాలు ఎలాగూ వుంటాయి కదా!

గుండెల్లో దడగా వున్నా, తల ఊపింది వనజ. లగ్గసరులనీ ఎంత ప్రయత్నించినా వంట మనిషీ దొరకలేదు.

"పోనీలే నీకు మరీ కష్టంగా లేకుండా ఓ మాంచి స్వీటు బజారునుంచి తెచ్చేస్తాను"

కామేశం దయకి, కరుణకి తన కష్టాన్ని గుర్తించిన అతని గొప్ప మనసుకి వనజ మురిసిపోయిందో క్షణం.

పనంటూ మొదలుపెట్టాక కష్టానికి ఖాతిరీ చేస్తే ఎలా కుదురుతుంది.

అందుకే వనజ తెల్లారుగట్ల ఎప్పుడో లేచి లేడిలా పనిలో దూకింది.

సమయానికి కరెంటు పోయింది. గారెలపిండి గ్రైండరుకు పంపేందుకు కుదరలేదు. వచ్చినట్టు వనజే రోటి దగ్గర చేరాల్సి వచ్చింది. నిజానికి గ్రైండ

రులో రుబ్బిన పిండితో చేసిన గారెల కంటే మనిషి రోట్లో రుబ్బితేనే బాగుంటాయి. (ముఖ్యంగా స్త్రీలు)

వంటంతా అయ్యేసరికి వొళ్ళు హూనమైంది. కాస్త టైమ్ దొరికితే మంచం మీద వాలిపోదామని వుంది. కానీ స్నానం చేసి నీట్‌గా తయారై అందరికీ చిరునవ్వుతో వడ్డించాల్సిన పని ముందరే వుంది.

అందరూ భోజనాలు చేస్తున్నంతసేపు ప్రతి ఒక్కరూ కామేశం మీద జాలి మాటలు కురిపిస్తూనే వున్నారు. ఇంతటి మహానుభావుడు అంత దూరం వంటరిగా వెళ్ళి ఎలా బతుకుతాడా అని వారి బాధ.

వనజకి వంట్లో అలసట కంటే వీళ్ళ మాటలకి ఒళ్ళు మంటగా వుంది.

"ఏవమ్మా! వనజమ్మ తల్లీ! రేపటినుంచీ అంతా విశ్రాంతే- హాయిగా కాలు మీద కాలేసుకుని కూర్చోవచ్చు"

హో....హో.... అంటూ నవ్వాడొకాయన-

"అదేవిటండీ. ఇద్దరు పిల్లలూ నేనూ వుంటాను. నాకు పనేం తగ్గుతుంది. ఇంటా బయటా మరింత పెరుగుతుంది" - నెమ్మదిగా అంది వనజ. ఒక స్థూల కాయుడైన సూట్‌వాలా అలాచూసి అయిదు నిముషాలు ఆలోచించి-

అవునూ- మీ మదర్‌ని వచ్చి యింట్లో వుండమని మీరెళ్ళి మీ హాబ్బీకి ఎందుకు సర్వ్ చెయ్యకూడదూ" అన్నాడు.

వనజకి చర్రున కోపం వచ్చింది. అసలు ఆడది పుట్టడమే మగాడికి సేవలు చేయడానికన్నట్లు మాట్లాడుతున్న ఆ సోకాల్డ్ మాడరన్ పురుష పుంగవుడ్ని చూస్తే అరికాలి మంట నెత్తికెక్కింది.

నాలిక చివరి దాకా వచ్చిన సమాధానం ఆపేసుకుంది సభ్యత కోసం.

"భర్తకి సేవలు చేసుకోవడం పూర్వజన్మ పుణ్యం" అందొక మధ్య వయసు మహిళ. పాపం ఆమెకి జీవితంలో ఆ అవకాశం లభించలేదు

"పాతికేళ్ళుగా సేవేం ఖర్మ- ఊడిగం చేస్తున్నాను" వనజ నవ్వి ఊరుకుంది.

"మీ అమ్మగార్ని రమ్మని రాయండి...." దీర్ఘం తీసింది మరో గొంతు.

"మా అమ్మకూడా మా నాన్నకి సేవలు చేసీ చేసీ ఇప్పుడే కాస్తంత అన్నం తిని కంటినిండా నిద్రపోతోంది"

వనజకి మనసులో మెదిలిన మాటలేవీ పైకి అనే ఓపిక లేదు-అన్నిటికీ అతికించుకున్న చిరునవ్వు ఒక్కటే సమాధానం.

అందరూ తలో సలహా యిస్తూ, మంచి విందు భోజనం పెట్టినందుకు కృతజ్ఞతలు చెప్తూ, త్వరగా తిరిగి వచ్చెయ్యాలని కాంక్షిస్తున్నట్లు చెప్తూ ఒక్కొక్కరే నిష్క్రమించారు.

అప్పుడు సామాను సర్దడం మొదలైంది.

వనజా ! ఈ టూ యిన్‌వన్ నాతో తీసుకెళ్దామనుకుంటున్నా"

"ఊఁ...."

"హ్యాండీగా వుంటుంది ట్రాన్సిస్టర్ కూడా తీసుకెళ్తా"

"ఊఁ—"

"నా కసలే చల్లని నీళ్ళు అలవాటు. ఫ్రిజ్ లేకపోతే ఎలాగో ఏమిటో"

"ఊఁ...."

"ఊఁ....ఏమిటి ? దాన్నెలా తీసుకెళ్ళాలా అని ఆలోచిస్తున్నా ఈ వాల్‌క్లాక్ ప్యాక్ చెయ్యి"

"ఊఁ...."

"ఫిల్టరు కాఫీ అలవాటు కదా. ఈ ఫిల్టరు వెయ్యి-

"ఊఁ....సరే"

"ఫ్లాస్క్"

"ఊఁ...."

"హాట్ ప్యాక్"

"ఊఁ...."

"వాటర్ బ్యాగ్"

"ఊఁ...."

"ఇంకా....ఏమిటి"ఒక్కసారి అంతా కలియచూస్తూ ఆలోచిస్తున్న కామేశాన్ని చూసి.

"మీకేం కావాలంటే అవి తీసుకెళ్ళండి" అంది నీరసంగా.

"అసలు మీరు వెళ్ళండి. అదే చాలు" అనుకుంది మానసికంగా.

* * *

కామేశం వెళ్ళి వారం రోజులైంది. వనజ జ్వరంతో మంచమెక్కి వారమే అయింది. డాక్టరు రోగమేమీ లేదు. విశ్రాంతి తీసుకోండని చెప్పారు. పిల్లలే అమ్మకి మందు తెచ్చి యిచ్చి వాళ్ళ తంటాలు వాళ్లు పడుతున్నారు.

ఆ ముందురోజే జ్వరం తగ్గింది వనజకి. నిస్సత్తువ శరీరమంతా వ్యాపించి వుంది. నిద్రకీ, మెలకువకీ మధ్య స్థితిలో ఏవేవో ఆలోచనలు అంతర్లీనంగా సాగు

తున్నాయి. ఆమెని కలత పెడుతున్నాయి. ఆడదై పుట్టినందుకు చాకిరీ-చాకిరీ చచ్చిపోయే వరకు పనిచేస్తూ, సేవలందిస్తూ వుండడమేనా మగవాడికి సేవలు చేయ డానికే ఆడది పుట్టిందనీ, అందరూ ఎంత నమ్మకంగా చెప్పేస్తున్నారు.

అసలు ఎదురు తిరిగి ఆలోచించే అవకాశమే లేకుండా ఎలా బ్రయిన్‌వాష్ చేసేస్తున్నారు ?

ఓ వనజా! నీ శరీరం, నీ శక్తి నీ, మనసు, నీ యిష్టం, నీ ఆలోచన, నీ అయిష్టతా నీకున్నాయని ఎప్పుడైనా ఆలోచించావా ?

తన అన్నం తను వండుకుంటాడనీ, తన స్నానం తను చేస్తాడనీ, తన ఉద్యోగం తను చేస్తాడనీ, తన మంచినీళ్లు తను తాగుతాడనీ అందరూ ఎంత సానుభూతి చూపించారు ?"

మరి ఇంతకాలం నువ్వతని కోసం ఇంత వెట్టిచాకిరీ చేసినా నీకేది సాను భూతి ? ఏది నీ శ్రమకి, పనికి గుర్తింపు ? పైగా నీకే కర్తవ్యం బోధిస్తున్నారే.

కరెంట్ పోయినట్లుంది. వనజకి వళ్ళంతా చెమట పట్టి చిరాకుగా వుండి పూర్తి మెలకువ వస్తూంటే బయట తలుపు మీద ఎవరో టకటక కొడుతున్నారు. అవును కాలింగ్‌బెల్ మూగబోయిందిగా మరి-మళ్ళీ అదే టకటక-కష్టంగా కళ్ళు విప్పి నెమ్మదిగా వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా కామేశం- వనజ వంట్లో రక్తం ఒక్కసారి వేగంగా ప్రవహిం చింది. మత్తు వదిలినట్లయింది

"వచ్చేశానోయ్ వనం! వెధవాఫీసు కొత్తగా పెట్టారు. అక్కడేం లేదు. పోస్టింగులు మాత్రం యిచ్చారు-శలవు పడేసి వచ్చేశాను

వనజేం మాట్లాడలేదు.

"అదేమిటలా వున్నావ్. జ్వరంగానీ వచ్చిందా? అరే–ఏం భయంలేదు. నేను శలవు పెట్టి వచ్చేశానుగా-ఇంక నేను చూసుకుంటా డోన్ట్‌వర్రీ–"

నిజం చెప్తున్నాగా-నువ్వు లేని ఈ వారంలో నీ విలువ తెలిసిందోయ్- మంచినీళ్ళు కూడా తీసుకుని తాగకుండా యిన్నాళ్ళూ నన్ను చెడగొట్టావ్. ఇక ముందు అలా సాగదు ఈ నెల్లాళ్ళూ కుక్కింగ్‌లో అప్రెస్టీస్ చేద్దామనుకుంటు న్నాను."

ఫ్రిజ్‌లోంచి మంచినీళ్ళు తీసుకుని గటగటా తాగేస్తున్న భర్తవైపు ఆశ్చర్యంగా, ఆలోచనగా చూస్తూండి పోయింది వనజ.

15–5–94 — (ఆంధ్రజ్యోతి)